

ఎప్పుడు మోహనరావు ఇంటికి వెళ్లినా ఆ రామచిలక పలకరించేది. స్పష్టంగా మనిషిలా పలుకులు వినిపించేవి అని చెప్పడానికి వీల్లేదు కాని ఆ ఆకుపచ్చ అందాలరాశి 'రండి రండి రావుగారూ' అంటూ కీచుకీచు పలుకులేవో పలికేది. టపటపమని రెక్కలు విదిలించేది. పంజరంలోని ఈ ప్రక్క కమ్ముల నుండి ఆ ప్రక్క దాకా ఎగిరేది. దాని పంజరం నిండా పండ్లముక్కలు, గింజలు చిందరవందరగా పడి ఉండేవి. ఒకమూల చిన్న డబ్బాలాంటిదాన్లోనీళ్లుండేవి.దాని పలకరింపు వినగానే బయటికి వస్తూ,మోహనరావు రావు గారా! నమస్కారం! రండి! నాకన్నా ముందు మా రాముడు మీకు స్వాగతం చెప్పాడుగదా!' అని నవ్వుతూ పలకరిం చేవారు.

ఏవో పిచ్చాపాటీ మాట్లాడుకునేవారు. ఎవరో కోయవాడిచ్చిన ఆ రామచిలుక వాళ్లింట్లో సభ్యునిలా మెలిగేది. మోహనరావుగారికి ఒక్కడే కొడుకు. వాడేమో న్యూయార్క్‌లో జియాలజీ ప్రొఫెసర్ గా ఉండేవాడు. ఆయన, వాళ్లావిడ, రామచిలుకా, ముచ్చటైన సంసారం. డబ్బు పుష్కలంగా ఉంది.

వాళ్ల కుటుంబ వాతావరణం వెన్నెలమయంగా ఉంటే, మా ఇంట్లో అంతా అమావాస్య కాదుగానీ, సమస్యల మయం. రోగంతో ఉన్న ముసలి

# పంజరం ఎగిరి పొమ్మంటోంది.. చిలక వద్దు పొమ్మంటోంది..

తండ్రి. పెళ్లికాని, చదువుకోని చెల్లెలు. ఫారెస్టాఫీసులో చాలీచాలని జీతంతో నా గుమాస్తా గిరి. ఇంత బాధల్లో మా సడలకుండా వెట్టుకొస్తున్న మా ఆవిడ. ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉండే తొమ్మిదేళ్ల కొడుకు. కూరలు, మందులు, వెచ్చాలు వంటి దైనందిన అవసరానికి కావాల్సినంత డబ్బు లేకపోవడం ఉండే అంత దౌర్భాగ్యం మధ్యతరగతివాడికి మరొకటి ఉండదు. ఒకవైపు లాక్కుంటే ఇంకోవైపు సరిగా కప్పని దుప్పటిలాటి ఆదాయం. పరిస్థితుల ఇసుప కమ్ముల మధ్య జీవితంవాది.

అన్నిటికన్నా పరమ నరకం మా ఆఫీసులో నరకాసురుడనే ఆఫీసరు పెట్టే నరకయాతన. అడ్డమైన గడ్డీ మేసి, ఎందరి కాళ్లనో పట్టుకుని పైకెగబాకిన ఆ శాల్తీకి ఆయన కింద పనిచేసేవాళ్లంటే అమిత చులకన భావం.

అతగాడికి ఇంగ్లీషు సుమారుగా వచ్చు. తెలుగు అంతంతమాత్రం వచ్చు. ఎవరినైనాసరే ఏకవచనంతో సంబోధించడం, వాళ్లు అవమానభారంతో గిలగిలలాడుతుంటే తన శక్తికి తానే మురిసిపోవడం అతని స్వభావం. ఆ గర్వ కాలుష్యంతో నిండిన అతని ముఖం పొంగిపొర్లుతున్న డ్రైనేజి కాలువలా ఉండేది.

ఒకరోజు మధ్యాహ్నం భోజన విరామంలో నేనారోజు దినపత్రికను తిరగేస్తున్నాను. ఉన్నట్టుండి తన గదిలోంచి నోట్లో సిగరెట్‌తో బయటికొచ్చాడాయన. దినపత్రికలో నిమగ్నుడనై ఉన్న నేను అది గమనించలేదు. నా పక్క గుమాస్తా జోగయ్య మోచేత్తో పొడిస్తే తలెత్తిచూసి లేచి నిలబడ్డాను. నావైపు ఉరిమిచూసి లోపలికెళ్లాడు ఆఫీసరు. కాసేపటికి భటుడు యాదయ్య వచ్చాడు.

"రావుగారూ! సార్ పిలుస్తున్నారు" అని ప్రకటించాడు.



# చిలకా పారిపో...

## వాకాటి పాండురంగ రావ్

జోగయ్య నావైపు జాలిగా చూశాడు. అతనికంటికి నేను వధ్యశాలకు వెళుతున్న లేగదూడగా కనబడి ఉండాలి. లోపలికెళ్లి ఓ పక్కగా నిలబడ్డాను. నేనురావడం గమనించినా, గమనించనట్లు నటిస్తూ మరో ఫైలు చూస్తూండిపోయాడు ఆఫీసరు. అట్లా తన కింద పనిచేసేవాడు గదిలో తివాచీలా, గోడమీది బూజులా పడివుంటే, అది తన పెద్దరికాన్ని పెంచుతుందని ఆయనగారి రాక్షస సైకాలజీ.

పదిపదిహేను నిమిషాల తరువాత ఓ కీటకాన్ని చూసినట్టు నావైపు చూశాడు. "ఏమయ్యా ఇది ఆఫీసా ఇల్లా అన్నాడు" వెటకారంగా.

నేనేమీ జవాబు చెప్పలేకపోయాను.

"ఏం? చెముడా లేక తెలుగు అర్థం కాదా?"

"అది కాదండీ!"

"ఏది కాదండీ! నీకు ముప్పూటలా సరిపడే జీతం ఇస్తుంటే, నీవు దర్జాగా కాలుమీద కాలేసుకుని పేపరు చదువ్‌తావ్. ఇదేం నీ మావగారిల్లమకున్నావా?

"లంచవర్ కదండీ"

ఉదయం ఉగాది సంచిక మార్చి 22, 1991

"రెండు తర్వాతకూడా లంచవ రేనా?"

"నాకు వాచీ లేదండీ"

"అయితే నాలుగింటిదాకా భోజనం చేస్తూ, కిళ్లీలు నములుతూ, పేపర్ చదువుకుంటానంటావా?"

"పొరపాటైపోయిందండీ! నేను ఆఫీసు వేళల్లోనే కాకుండా సాయంకాలం లేటైనా పనిచేస్తుంటానండీ!"

"చెయ్యాలోయ్! ఎవడికోసం చేస్తావ్! నా ఇంటిపని చేస్తున్నాననుకుంటున్నావా? సర్కారువాడి సొమ్ము తేరగా తినడంలేదూ! అందుకోసం చెయ్యాలి. చెయ్యకపోతే ఛార్జిషీటిచ్చి ఇంటికి పొమ్మంటారు. చేసింది వెధవపని, దానికితోడు పోరు కూడాను. గుమస్తాలకే ఇంత కావరమైతే దేశమెట్లా బాగుపడుతుందయ్యా! వెళ్లు! ఒళ్లు దగ్గర పెట్టుకుని మసలుకో!"

నా శరీరం బయటికొచ్చింది. మనస్సు ఉడికి ఉడికి ఊరుకుంది. కేవలం గుమాస్తాగాడిలా బ్రతుకుతున్న నాకు ఆత్మాభిమానం అనేది ఉండడం లగ్జరీగదా! ఆ లగ్జరీ కావాలంటే ఉద్యోగం ఉండదు మరి!

నేనొక్కణ్ణే అయితే నేనక్కడ వాడిని లాగి లెంపకాయకొట్టి రాజీనామా ఉత్తరం వాడిమొగాన పడేసి వచ్చేవాణ్ణి. కానీ నామీద ఆధారపడివున్న వాళ్లు నలుగురున్నారు. వాళ్లకోసమన్నా అభిమానం చంపుకు బ్రతకాలి.

అయినా ఇలా వచ్చిపోవడం ఇది మొదటిసారి కాదుగదా!

*** **** ***

ఎదురింటి మోహనరావుగారబ్బాయి పెళ్లికోసం అమెరికా నుండి వచ్చాడు. రంగరంగ వైభవంగా పెళ్లి జరిగింది.


ఆ అబ్బాయి తన తల్లిదండ్రులతో మీ ఇద్దరు మాత్రం ఒంటరిగా ఇక్కడుండడం ఎందుకు! నాతోపాటు అమెరికా రండి!' అని బలవంతం చేయడంతో మోహనరావు, ఆయన భార్యకూడా బయలుదేరారు.

వెళ్తూ వెళ్తూ "మా రాముణ్ణి మీ దగ్గర వదలివెళ్తాం. ఏమీ అనుకోకుండా తీసుకోండి. అమెరికా తీసుకెళ్దాం అంటే అక్కడ రానివ్వరట" అని ఆయన బ్రతిమిలాడితే కాదనలేకపోయాను.

ఆ విధంగా రామచిలుక మా ఇంట్లో చేరింది.

*** *** ***

ఆఫీసులో ఇంకోసారి నేను రాసిన నోటులో తనకు నచ్చని అంశం ఉంటే అది సాకుగా ఆఫీసరు ఆ ఫైలును నా మొహంకేసి విసిరేసి "మైండ్ యూ! నీవు బ్లడీ గుమాస్తావి. నీ హద్దులు మీరి రాయకు తెలిసిందా?" అని కసిరాడు.




ఆ సాయంకాలం ఇంటికి వచ్చిన తరువాత రామచిలుకను చూస్తే హఠాత్తుగా అనిపించింది. దానికీ, నాకూ చాలా పోలికలున్నాయని, కనబడే పంజరంలో రామచిలుక బందీ. కనపడని పంజరంలో నేను బందీని. ఇనుప ఊచల పంజరం దానిది. పరిస్థితుల పంజరం నాది.

నాఅన్న వారెవరూలేని ఒంటరి ఖైదీ ఆ చిలుక. నాఅన్న వారున్నా ఒంటరిని, ఖైదీని నేను.

హఠాత్తుగా తోచింది. అయ్యో! ఆ చిలుకనిలా పంజరంలో బంధించి దాని స్వేచ్ఛనపహరించడం పాపం కదా! అని వెంటనే లేచి ఆ పంజరం తలుపు తెరిచాను. తక్షణం ఆ రామచిలుక నావైపు కృతజ్ఞతగా చూచి రెక్కలు విదిలించుకుని రివ్వున నీలాకాశంలోకి ఎగిరిపోతుంది— అని అనుకున్నాను. కానీ అది పంజరంలోనే ఉంది. ఒక జామపండు ముక్కను ఎరగా చూపించి, దాన్ని తలుపు దగ్గరకు రానిచ్చి, ఒడిసిపట్టి నా చేతుల్లోకి తీసుకున్నాను.

"ఎగిరిపోవే రామచిలుకా!" అని దాన్ని వదిలిపెట్టాను.

"ఊహూ!" అది పోలేదు.

రెక్కలల్లార్చుకుంటూ ఆ గదిలోనే కొద్దికొద్దిగా గంతులు వేసినట్లు ఎగిరి, అక్కడ కాసేపు, ఇక్కడ కాసేపు కూర్చుని చివరకు పంజరంలోకే వెళ్లడానికి ప్రయత్నించింది.

నాకు నవ్వూ, ఏడుపూకూడా వచ్చాయి. పంజరానికి అలవాటుపడ్డ ఆ చిలుకకు స్వేచ్ఛ అంటే తెలిసిరాలేదు. నీలాకాశం దానికవసరం లేకపో


రుచికరమైన 19 రకాలలో లభ్యం కాగలవు.




ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.

ఖుంది.

సరే! దానిలాగే నేనూ జీవితం వెళ్లబుచ్చుతున్నాను.

ఆ రోజునుంచీ సాయంకాలాలు మాత్రం పంజరం తలుపు తెరిచే ఉంచుతున్నాను.

ఆఫీసులో హింస రోజురోజుకు హెచ్చుతూ వుంది. అవమానం పొందని రోజు ఆనందమైన రోజు అనుకునేంతగా దిగజారింది నా పరిస్థితి.

నాలాగే బాధలుపడ్డ యాదయ్య ఒకరోజు హఠాత్తుగా వచ్చి చెప్పాడు.

"సార్! నేను వాడిదగ్గర ప్యూను ఉద్యోగం చెయ్యనుసార్! రాజీనామా ఇచ్చేశాను".

"ఆదేమిటయ్యా సంసారం ఎట్లా గడుస్తుంది?" అని నేనడిగితే "రిక్షా తొక్కుతానుసార్!" అన్నప్పుడు వాడి కళ్లల్లో వెలిగిందే... అదే స్వేచ్ఛ ప్రసాదించే ప్రాణవాయువు యొక్క కాంతి.

"చదువుకోని వాణ్ణి నేనే బ్రతకగాలేంది, సార్ చదువుకున్నవారు మీ రెండుకిట్లాంటి పనికి వాడిదగ్గర గులాంలాగా ఉండాలి. ట్యూషన్లు చెప్పుకోవచ్చు. బండిమీద గారెలమ్ముకోవచ్చు. బ్యాంకు అప్పుతీసుకుని వ్యాపారం పెట్టుకోవచ్చు. ఏదన్నా చెయ్యవచ్చుగాని ఈ బానిస బ్రతుకు బ్రతకొద్దుసార్" అన్న యాదయ్య నాకు ఆదిశంకరాచార్య అంత ఎత్తుగా కనిపించాడు.

అవే మాటలు చెవిలో గింగురుమంటుండగా ఇల్లు చేరాను.

ఒక విచిత్రం జరిగింది. ఆ సాయంకాలం ఎక్కణ్ణించి వచ్చిందో ఒక కొత్త చిలుక మా ఇంటి బయటవున్న గానుగచెట్టుమీద కూర్చుని కిచకిచలాడుతూంది. ఉండుండది మా వరండాలోకి దిగివచ్చి మా ఇంటి చిలకనేదో పలుకరిస్తున్నట్లు అరుస్తోంది. మా చిలుక వింతగా చూసి ఏదో సమాధానాలిస్తోంది.


ఆ చిలుక పలుకుల వెనుకవున్న వేదాలేమిటో మరి!

నేను లోపలికి వెళ్లి స్నానంచేసి దేవుడి దగ్గర సాయందీపాన్ని వెలిగించి దండంపెట్టి బయటికొచ్చాను.

ఆశ్చర్యం! వరండాలో పంజరం ఖాళీగా ఉంది. చిలక పంజరాన్ని వదిలింది. స్వేచ్ఛగా మేఘాల్లోకి ఎగిరిపోయింది. నాకు క్రొత్తగా ప్రాణం వచ్చినట్టయ్యింది.

గబగబా లోనికివచ్చి కాగితం, కలం తీసుకున్నాను.

రాజీనామా ఉత్తరం రాయడం మొదలెట్టాను.



## పాత పాట

త్వరగా వచ్చేయమని
ఎన్ని చెప్పాలనుకున్నాను నీకు
నీలి విషాకళ్ల కొసల దిగులు బొట్టు నిలవకముందు

అలిసిన రెప్పలకింద
వర్గీకృత ప్రకటనలన్నీ భోంచేసి బరువెక్కిన చూపుల్ని
గోడమీది ముల్లు గురిచూచి గుచ్చకముందు

ప్రేమపుప్పొడి అద్దుకుని షోగ్గా విచ్చేసిన పిల్ల వెన్నెల
వేళమించి తన ఉనికిట తగునా అని సంకోచించి
జ్ఞానోదయపు సూర్యకాంతి సోకి పాలిపోకముందు

ఎటూ తోచక
చెమ్మని పీల్చుకోనా స్ఖలించనా అని
కన్ను సందేహించకముందు

చెప్పుకే విరిగిన నవ్వుతో
[illegible] కన్నుల్తో
ప్రేలాడే పరికిణీ బొందుతో వెలసిన జాకెట్టుతో
సందుచివర పనిపిల్ల జుట్టు నెట్టుకుంటూ తూగిరాక ముందే
నెలవంకల చిరునవ్వులతో రమ్మని
ఎంత చెప్పాలనుకున్నాను

ఏదీ
నీ క్రోధం
ఎక్కడా గెలవని నిరాశావాదం

పెదవి కదపని స్త్రైనా
రెక్కలిప్పిన నా ఊదారంగు ఊహలకు
నీ ఉనికి ఉష్ణమండలం పై ఊపిరాడని స్త్రైనా

అన్నీ సరే
అసలు ఎదురుచూపులెందుకన్నా నీ ప్రశ్న చురకత్తిలా
పూలతోటని చిటికెలో తొక్కుకుంటూ వేసే మంత్రగత్తెలా!